సాక్షి గుంటూరు

మంగళవారం । 12 । ఆగస్టు । 2025



నిర్మాణ పనులు పరిశీలన

తాడికొండ: రాయపూడిలోని సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని సోమవారం మంత్రి నారాయణ పరిశీలించారు. ఏ+7 అంతస్తులతో ఇది నిర్మాణంలో ఉందన్నారు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి సోమవారం 6,908 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.



జర్నలిజం పరీక్షలు ప్రారంభం

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం డిప్లమో ఇన్ జర్నలిజం కోర్సు పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 14తో ముగుస్తాయి.

న్యూస్‌రీల్

గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్



గుంటూరు ఎడ్యుకేషన్ : స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. ఈ దృష్ట్యా సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కార్యక్రమ ఏర్పాట్లు పరిశీలించారు. 'ఏపీ క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్ అండ్ అమరావతి ప్లాస్టిక్ ఫ్రీ సిటీ' ప్రచార కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో వేంకటేశ్వర విజ్ఞాన మందిరాన్ని సందర్శించిన కలెక్టర్ సీటింగ్ ఏర్పాట్లపై అధికారులతో పాటు రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో చర్చించారు. కార్యక్రమంలో జేసీ ఏ.భార్గవ్‌తేజ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైటీ రామారావు, కోశాధికారి పి. రామచంద్రరాజు, తూర్పు మండల తహసీల్దార్ సుభానీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ రెండవ వైస్ చైర్మన్ రాజీనామా ఆమోదం



చీరాల: చీరాల మున్సిపల్ రెండవ వైస్ చైర్మన్ శిఖాకొల్లి రామసుబ్బులు గత నెల 14న తన పదవికి రాజీనామా చేస్తూ కమిషనర్‌కు లేఖను అందించారు. వైఎస్సార్ సీపీకి చెందిన రామసుబ్బులు వైస్ చైర్మన్ పదవికి సంబంధించిన రాజీనామాపై సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించారు. త్వరలో వైస్ చైర్మన్-2ను భర్తీ చేస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చీరాల మున్సిపాలిటీలో పలు సమస్యలు ఉన్నాయని, ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు.

సెలవు దినాల్లో గ్రీవెన్స్ ఉండదు

తాడికొండ: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే 'గ్రీవెన్స్' కార్యక్రమం ప్రభుత్వ సెలవు దినాలలో జరగదని కమిషనర్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సెలవు, ఆ రోజు కార్యక్రమం ఉండదన్నారు. రాజధాని రైతులు, భూ యజమానులు తమ వినతులు, ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పరిష్కారం పోర్టల్ ద్వారా ఎప్పుడైనా సమర్పించవచ్చని పేర్కొన్నారు.

కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం తీవ్రనష్టం



యడ్లపాడు: కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం దేశానికి తీవ్ర నష్టమని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వై.కేశవరావు హెచ్చరించారు. రైతు ఉద్యమాల స్ఫూర్తి ప్రదాత పోపూరి రామారావు 6వ వర్ధంతి, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి సభ స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో నూతలపాటి కాళిదాసు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కేశవరావు మాట్లాడుతూ పోపూరి రామారావుతో సుదీర్ఘకాలం రైతు ఉద్యమంలో పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్నారు. హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ సేవలను స్మరించుకున్నారు. ఆలోకం పెద్దబ్బాయి, ప్రొఫెసర్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

బాలిక వివాహాన్ని నిలిపివేసిన అధికారులు

ఊటుకూరు(క్రోసూరు) : ఊటుకూరు గ్రామంలో సోమవారం మైనర్ వివాహం జరుగుతుందన్న సమాచారం మేరకు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.వెంకటలక్ష్మీ, ఎంపీడీవో రవికుమార్ వెళ్లి వివాహాన్ని నిలిపివేశారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అమ్మాయికి 19 సంవత్సరాలు నిండిన తరువాత వివాహం చేయాలని తెలిపారు. బాల్యవివాహ నిరోధక చట్టం ప్రకారం పెళ్లికి సహకరించిన ప్రతి ఒక్కరు శిక్షార్హులేనని అన్నారు. ఈ సందర్భంగా తల్లిని, మేనమామను బైండోవర్ చేశారు.

గురువుపై మూల్యాంకన బరువు

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్నట్లు విద్యాశాఖ విషయంలో కూటమి సర్కారు తీరు ఉంది. అర్థంపర్థం లేని నిర్ణయాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులపై పెను భారం మోపింది. అసెస్‌మెంట్ పుస్తకాలు అంటూ కొత్త పరీక్షల విధానం తీసుకొచ్చి సర్కారు బడుల్లో విద్యాప్రమాణాలు మరింత దిగజారుస్తోంది. దీనిపై విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- పరీక్షల సంస్కరణల పేరుతో తెరపైకి అసెస్‌మెంట్ పుస్తకాలు
- ఎఫ్‌ఏ-1 పరీక్షల నుంచి అమల్లోకి తెచ్చిన విద్యాశాఖ
- జవాబులు రాసేందుకు పేపర్లకు బదులు పుస్తకాలు పంపిణీ
- అన్ని పాఠ్యాంశాలకు ప్రత్యేక పుస్తకంలో విద్యార్థుల సమాధానాలు
- బడుల్లోనే మూల్యాంకనం చేయాల్సి రావడంతో బోధనపై ప్రభావం
- పాత సమాధానాలు చూసి తర్వాత పరీక్షలో విద్యార్థులు రాసే అవకాశం

విద్యార్థులు, ఉపాధ్యాయుల జీవితాలతో కూటమి సర్కార్ ఆటలు



గుంటూరులోని జలగం రామారావు హైస్కూల్లో పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ-1) పరీక్షల్లో అమల్లోకి తెచ్చిన అసెస్‌మెంట్ బుక్స్ గందరగోళానికి తెర తీశాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సోమవారం నుంచి ఈ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. విద్యాసంవత్సరం పొడవునా నిర్వహించే ఎఫ్‌ఏ, ఎస్‌ఏ పరీక్షల ప్రశ్నలకు జవాబులు రాసేందుకు విద్యార్థులకు ఇస్తున్న ఆన్సర్ షీట్ విధానంలో మార్పులు చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కొత్తగా అసెస్‌మెంట్ బుక్‌ను ప్రవేశపెట్టింది. గుంటూరు జిల్లాలోని 965 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు 90 వేల మంది విద్యార్థులకు ఈ పుస్తకాలను పంపిణీ చేశారు.

తరగతులవారీగా పరీక్షలు

- 1, 2వ తరగతుల విద్యార్థులు తెలుగు, ఇంగ్లిషు, గణితం పరీక్షలు రాయాల్సి ఉంది. 3,4,5వ తరగతులకు వీటికి అదనంగా సైన్స్ పరీక్ష జరుగుతుంది. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఒకరిద్దరు చొప్పున ఉన్న ఉపాధ్యాయులకు ఆయా పరీక్షల నిర్వహణ పెనుభారంగా మారింది. వందల సంఖ్యలో విద్యార్థులు ఉన్న ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులకు ఇది తలకు మించిన భారంగా మారుతోంది.
- అసెస్‌మెంట్ పుస్తకంలో విద్యార్థులు తమ అపార్ నంబర్, పరీక్ష కోడ్ రాసి బబ్లింగ్ చేయాలి. పుస్తకంలో జవాబులు రాయడంతో పాటు అందులో పొందుపర్చిన ఓఎంఆర్ షీట్‌లో సరైన సమాధానాలకు బబ్లింగ్ చేయాలి.

ఉపాధ్యాయులకు కష్టాలు

ఈ పుస్తకాలకు మూల్యాంకనం నిర్వహించడం ఉపాధ్యాయులపై పెనుభారంగా మారనుంది. సింగిల్ టీచర్ ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో గురువులకు ఇబ్బంది తప్పదు. అలాగే ఉన్నత పాఠశాలల్లో వందల మంది విద్యార్థులు ఉంటే మూల్యాంకనానికే రోజుల తరబడి సమయం పడుతుంది. 450 మంది విద్యార్థులు ఉన్న హైస్కూళ్లలో హిందీ సబ్జెక్టు బోధనకు ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండటంతో పేపర్ కరెక్షన్‌కు 10 రోజుల సమయం పట్టనుంది. అధిక బరువు కారణంగా మూల్యాంకనం పాఠశాలలోనే చేయాల్సి ఉంది. ఫలితంగా సిలబస్ బోధించేందుకు ఇబ్బందులు తప్పవు. పరీక్ష నిర్వహణ, మూల్యాంకనానికి అధిక సమయం తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. బోధనపై దృష్టి సారించేందుకు సమయం సరిపోని పరిస్థితి ఉంటుంది. మరోవైపు హోలిస్టిక్ కార్డులను కూడా పూరించాలి.


అందరికీ పెనుభారం

అసెస్‌మెంట్ బుక్స్ విధానం గందరగోళంగా ఉంది. విద్యార్థుల్లో స్వయం ఆలోచన, సృజనాత్మతను దూరం చేసేలా పరీక్షల నిర్వహణ ఉంది. మూల్యాంకనంలో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతారు. పుస్తకాలను రద్దు చేసి, పూర్వ విధానంలోనే పరీక్షలు నిర్వహించాలి. ఎఫ్‌ఏ పరీక్షలకు రాసిన సమాధానాలు అదే పుస్తకంలో చూసి ఎస్‌ఏ పరీక్షలకు కూడా రాసే పరిస్థితి ఉంది.

– కె. బసవ లింగారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

కాపీ కొట్టేలా ప్రోత్సాహం

ఎఫ్‌ఏ -1, ఎఫ్‌ఏ -2 పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నలు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో పునరావృతం అయ్యే అవకాశాలున్నాయి. ఎఫ్‌ఏ పరీక్షలకు రాసిన జవాబులు పుస్తకంలోనే ఉండటంతో తిరిగి వాటినే చూసి రాసేందుకు వీలుంటుంది. తద్వారా విద్యార్థులకు నష్టం కలగనుంది. ఈ పుస్తకాలను విద్యాసంవత్సరం పొడవునా పాఠశాలల్లో భద్రపర్చడం సమస్యగా మారనుంది. అవసరమైన సదుపాయాలు చాలాచోట్ల లేవు. ఏ ఒక్క పుస్తకం పోయినా విద్యార్థికి సమస్యగా మారనుంది. సంస్కరణల పేరుతో తీసుకున్న ఈ నిర్ణయంపై ముందుగా ఉపాధ్యాయులకు కనీసం అవగాహన కల్పించలేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ తరహా నిర్ణయాలను విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దడం తగదన్నారు. దీనిపై విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



అసెస్‌మెంట్ పుస్తకం

ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడండి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలు



పట్నంబజారు: నగరంలో శంకర్‌విలాస్ ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభమైన నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కంకరగుంట అండర్‌పాస్, బ్రాడీపేట 4వ లైను, శంకర్‌విలాస్ సెంటర్, డొంకరోడ్డు, మూడు వంతెనలు, రంగాబొమ్మ సెంటర్, కొత్తపేట శివాలయం సెంటర్, భగత్‌సింగ్ సెంటర్, డీమార్ట్, నాజ్ సెంటర్, ఉమెన్స్ కళాశాల రోడ్డు, ఎంటీబీ సెంటర్‌లలో బైక్‌పై ఆయన పర్యటించారు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఏ అశోక్‌కుమార్‌లకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ నిలవకుండా సిబ్బంది సమర్థంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. వాహనదారులకు సమన్వయంతో ట్రాఫిక్ డైవర్షన్ల గురించి వివరించాలని, వారు తప్పక పాటించేలా చూడాలని ఆదేశించారు.

సహనంతో విధులు నిర్వర్తించాలి

ట్రాఫిక్ నెమ్మదించినా.. కొద్దిపాటి ఇబ్బందులు కలిగినా.. సహనం పాటించాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. వ్యాపార సముదాయాల వారు తమ కస్టమర్ల కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. వాహనదారులు రోడ్డుపై కాకుండా నిర్దీత పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలిపేలా చూసుకోవాలన్నారు. మళ్లింపులకు సంబంధించి సూచిక బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సీఐలు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని పర్యవేక్షించాలని పేర్కొన్నారు. అవసరమైన చోట సిబ్బందిని అధికంగా కేటాయించటం, ముఖ్యమైన కూడళ్లపై దృష్టి సారించాలన్నారు. వెంట అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు, ట్రాఫిక్ ఎస్సై సాంబశివరావునాయక్ తదితరులు ఉన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్ అర్జీలను గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులకు షోకాజ్ నోటీసులు పంపాలని ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఇందులో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ అర్జీలు స్వీకరించాలని పేర్కొన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కోర్టుల్లో ఉన్న సివిల్ వివాదాలు, వ్యక్తిగత సమస్యలపై అర్జీలు ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు. కోర్టు కేసులకు సంబంధించి సమాధానాలు నిర్ణీత గడువులోనే దాఖలు చేయాలన్నారు. మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు కూడా ప్రతి వారం ప్రజలు తమ అర్జీలు ఇవ్వొచ్చన్నారు. 225 అర్జీలను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

గ్రామ స్థలాన్ని కాపాడండి



ప్రత్తిపాడు మండలం, రావిపాటి వారిపాలెం గ్రామంలో ప్రజల అవసరాలను తీర్చేందుకు 60 సెంట్లు భూమిని ఉంచారు. కొందరు వ్యక్తులు 15 సెంట్లు కబ్జా చేసి దానిలో చర్చి నిర్మాణం కోసం దరఖాస్తు చేశారు. పంచాయతీ కార్యదర్శితోపాటు తహసీల్దార్‌లు అక్రమార్కులతో కుమ్మక్కై నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

– దయాసాగర్, రావిపాటి వారిపాలెం, ప్రత్తిపాడు మండలం

గుంటూరు చానల్‌ను పొడిగించాలి



ప్రభుత్వ పథకాలపై ప్రజలు ఆధారపడకుండా వారి స్వయం అభివృద్ధి సాధించుకునేలా ప్రభుత్వాలు కృషి చేయాలి. దీనికి సంబంధించి గుంటూరు చానల్ అభివృద్ధి చేస్తే ఎన్నో ఎకరాలు సాగులోకి వస్తాయి. నల్లమడ ప్రాంత వరద ముంపునకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ప్రభుత్వాలు ఈ ప్రాజెక్ట్‌ను నిర్లక్ష్యం చేయడం తగదు

– నల్లమడ ప్రాంత రైతు సంఘం నేతలు

ధూళిపాళ్ల మనిషినంటూ బెదిరింపులు

- భర్త నుంచి రక్షణ కల్పించాలని మహిళ వేడుకోలు
- పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన
- ఫ్లెక్సీ చేతపట్టుకుని జిల్లా పోలీస్ కార్యాలయం ఎదుట నిరసన



జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట వెంకటేశ్వరమ్మ

సాక్షి, టాస్క్‌ఫోర్స్: టీడీపీ జెండా పట్టుకుంటే చాలు.. ఎంతటి మోసం, అన్యాయం, అక్రమమైనా చేయొచ్చనే భావనతో పొన్నూరులో పచ్చ పార్టీ కార్యకర్తలు చెలరేగిపోతున్నారు. గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు కుడి భుజం(రైట్ హ్యాండ్) అని చెబుతూ తిరిగే తన భర్త నిత్యం చిత్రహింసలకు గురి చేస్తున్నాడని ఓ మహిళ వాపోయింది. ఇప్పటికే జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు సార్లు, స్థానిక పొన్నూరు పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఫ్లెక్సీ చేత పట్టుకుని నిరసన వ్యక్తం చేసింది. అనంతరం బాధితురాలు మీడియాతో మాట్లాడుతూ... పొన్నూరు మండలం అలూరు గ్రామానికి చెందిన తనకు సుమారు ఎనిమిదేళ్ల క్రితం పాల్‌రాజుతో ప్రేమ వివాహమైందని చెప్పారు. భర్త పంచాయితీ పనులకెళ్తూ, ప్రస్తుతం పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు కుడి భుజమని చెబుతున్నాడని పేర్కొన్నారు. కట్న కానుకల కింద పాండ్రపాడులోని రెండెకరాల పొలం, పది తులాల బంగారం తమవారు ఇచ్చారని పేర్కొన్నారు. ఆరేళ్ల క్రితం కొంత పొలాన్ని రూ.19 లక్షలకు విక్రయించి రాజకీయాల్లో తిరిగి ఖర్చు చేశాడని తెలిపారు. మరో ఎకరం విక్రయించేందుకు అంగీకరించకుంటే కాపురానికి రానివ్వ బోనని, తనను, తన బిడ్డను చంపుతానని బెదిరిస్తున్నాడని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. ఎవరికైనా దీనిపై ఫిర్యాదు చేసినా చంపేస్తానని, తర్వాత స్టేషన్లో లొంగిపోతానని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పేరు చెప్పి తీవ్రంగా బెదిరించేవాడని కన్నీరు మున్నీరయ్యారు. గత నెల 11వ తేదీన మరణాయుధంతో దాడికి పాల్పడగా, అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డానని తెలిపారు. భర్త వద్దనే తమ కుమార్తె కూడా ఉందని పేర్కొన్నారు. తనకు కుమార్తెను అప్పగించాలని వేడుకున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి భర్త, అతని కుటుంబ సభ్యుల నుంచి తనను, తన వారిని కాపాడి న్యాయం చేయాలని కోరారు.

మద్యం తాగొచ్చి చిత్రహింసలు

ఆస్తుల కోసమే తనను పెళ్లి చేసుకున్నట్లు భర్త పలుమార్లు చెప్పాడని బాధితురాలు వివరించారు. తక్కువ కులం దానినంటూ నోటికొచ్చినట్లు దూషించేవాడని వాపోయారు. చిత్రహింసలకు గురిచేయడంతోపాటు, తన కుటుంబ సభ్యులను ఇంటికి రానిచ్చేవాడు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. వారితో మాట్లాడటానికి కూడా అంగీకరించేవాడు కాదని వాపోయారు. స్నేహితులతో కలిసి నిత్యం మద్యం తాగొచ్చి, వివాహేతర సంబంధాలు ఉన్నాయంటూ వేధించేవాడని తెలిపారు.

నేడు క్విట్ ఇండియా వీర సంస్మరణ దినోత్సవం

సమర దీప్తి... తెనాలి స్ఫూర్తి

దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో క్విట్ ఇండియా ఉద్యమం మహత్తర ఘట్టం. ఈ పోరాటంలో తెనాలివాసుల సాహసం, బ్రిటిష్ పోలీసులపై చూపిన తెగువ, బలిదానం జాతీయ స్థాయిని సైతం ఆకర్షించాయి. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖితమైంది.



ఆవిష్కరణకు సూర్యరథంపై వస్తున్న నాటి ఆంధ్ర, తమిళనాడు సీఎంలు సంజీవరెడ్డి, కామరాజ్



నాటి జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వెర్రెయ్య గారి మేడ

తెనాలి: స్వాతంత్ర్య పోరాటంలో తెల్లదొరలు దేశం విడిచివెళ్లాలనే నినాదమే 'క్విట్ ఇండియా'. 1942 ఆగస్టు 8న ముంబయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సంఘం కార్యవర్గం ఇచ్చిన క్విట్ ఇండియా పిలుపునకు యావత్ భారతం వెంటనే స్పందించింది. ఆగస్టు 9న దేశంలోని అనేక నగరాల్లో హర్తాళ్ జరిగింది. ముంబయి సమావేశంలో పాల్గొన్న తెనాలి ప్రముఖులు కల్లూరి చంద్రమౌళి, వెలువోలు సీతారామయ్య, పుతుంబాక శ్రీరాములు, అవుతు సుబ్బారెడ్డి, శరణు రామస్వామిలు 11వ తేదీన తిరిగొచ్చారు. ఆ రోజే ఇక్కడి ఓల్డ్ టౌన్‌లోని వెర్రెయ్య గారి మేడలో గల జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆగస్టు 12న తెనాలి పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. నాయకులను అరెస్టు చేశారు. కాంగ్రెస్‌వాదులు, తెనాలి తాలూకా హైస్కూలు, భారత్ ట్యుటోరియల్ కాలేజీ విద్యార్థులు పట్టణ బంద్‌కు సిద్ధమయ్యారు. ఆగస్టు 12న తెల్లవారేసరికి తెనాలి జనసంద్రమైంది. కల్లూరి చంద్రమౌళి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నన్నపనేని వెంకట్రావు, కార్యదర్శి రావి అమ్మయ్య నేతృత్వంలో వేలాది మంది విద్యార్థులు బంద్‌లో పాల్గొన్నారు.

రైల్వేస్టేషనులో విధ్వంసం

రైల్వేస్టేషను సమీపంలోని బంద్ పాటించని హోటల్‌కు ప్రదర్శకులు వెళ్లి సామగ్రిని బయటపడేశారు. రైల్వేస్టేషనులో పండ్లదుకాణం, హోటల్‌నూ మూయించారు. అక్కడే స్పెన్సరు క్యాంటీనులో మద్యం సీసాలను ధ్వంసం చేశారు. నార్త్ క్యాబిన్ దగ్గర్లోని ఆయిల్ ట్యాంకరుకు నిప్పటించారు. ఉవ్వెత్తున ఎగసిన మంటలకు ఉద్వేగ భరితులైన ప్రదర్శకుల దృష్టి ప్లాట్‌ఫాం పక్కన ఆగివున్న గూడ్స్ వ్యాగన్లపై పడింది. రెండు వ్యాగన్లలోని షాహి డక్కన్ సిగరెట్ల బండిల్స్‌ను ప్లాట్‌ఫాంపై వేసి తగులబెట్టారు. మరో రెండు వ్యాగన్లలోని విదేశీ మద్యం సీసాలు గల కార్టన్లను, ఇంకో వ్యాగనులోని నూలు కండెల్ని తగులబెట్టారు. ఈలోగా మరో బృందం బుకింగ్ ఆఫీసులోకి ప్రవేశించింది. అక్కడి టికెట్లను, నగదును గుట్టగా పోసి దహనం చేశారు. నగదును ఎవరూ ముట్టుకోలేదు. అప్పటికి మద్రాసు నుంచి పూరి ప్యాసింజరు రైలు వచ్చి ప్లాట్‌ఫాంపై ఆగింది. ప్రయాణికులు దిగాక నాలుగు బోగీల్లో కిరోసిన్ పోసి ఉద్యమకారులు నిప్పంటించారు.

పోలీసు తూటాలకు ఏడుగురు బలి...

అధికారుల ఆదేశాలతో పోలీసులు కాల్పులకు తెగబడ్డారు. తూటాలకు మాజేటి సుబ్బారావు, శ్రీగిరి లింగం, భాస్కరుని లక్ష్మీనారాయణ, తమ్మినేని సుబ్బారెడ్డి, గాలి రామకోటయ్య, ప్రయాగ రాఘవయ్య, జాష్టి అప్పయ్యలు నేలకూలారు. రైల్వేస్టేషను దహనమైన కొన్ని గంటల్లోనే సమీప దుగ్గిరాల రైల్వేస్టేషన్‌నూ నిరసనకారులు తగులబెట్టారు. అక్కడ నాయకత్వం వహించిన వెనిగళ్ల సత్యనారాయణను పోలీసులు అరెస్టు చేశారు. తెనాలిలో అరెస్టయిన వారిలో రావి సత్యనారాయణ, రావి అమ్మయ్య కూడా ఉన్నారు. పోరాటం జరిగిన ప్రదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక రణరంగ చౌక్‌గా నామకరణం చేశారు. 1959లో తెనాలి మున్సిపల్ చైర్మన్ ఆలపాటి వెంకట్రామయ్య, ఇక్కడ అమరవీరుల స్మృతిచిహ్నాంగా ఏడు స్తూపాలను నిర్మించారు. అదే ఏడాది డిసెంబరు 20న అప్పటి ఏఐసీసీ అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి కామరాజ్ నాడార్‌చే ఆవిష్కరింపజేశారు. నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, కాంగ్రెస్ ప్రముఖులు కాసు బ్రహ్మానందరెడ్డి, దామోదరం సంజీవయ్య, వెనిగళ్ల సత్యనారాయణ, కన్నెగంటి రెడ్డమ్మచౌదరి పాల్గొన్నారు. ఏటా ఆగస్టు 12న అమరవీరులకు నివాళిగా వీర సంస్మరణ దినం నిర్వహిస్తున్నారు.



అమరవీరుల స్తూపాలు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,600 గరిష్ఠం : రూ. 3,600

మోడల్ ధర రూ. 3,200

మిర్చి

యార్డు సమాచారం

(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	51,722
అమ్మకాలు	49,176
నిల్వ	7,724

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,400
నంబరు-5	10,000-13,200
341	10,000-14,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,200
నంబరు-5	10,000-13,300
341	10,000-14,600
4884	10,000-12,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,200
బాడిగ-355	10,000 - 13,000
దేవనూరు డీలక్స్	10,000 - 13,000
ఆర్మూర్	9,800 - 11,000
తాలుకాయలు	5,000 - 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-14,000
బాడిగ - 355	10,000-12,500
దేవనూరు డీలక్స్	10,200 - 12,800
తాలు	5,300 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు

(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 758

కొమ్ములు : 543 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,400	10,500	10,381

కాయలు : 170 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,400	10,500	10,350

మొత్తం అమ్మకాలు : 568.500 క్వింటాళ్లు

వ్యాపారులకే 'పండుగ'!

- పూజా సామగ్రి ధరలకు ఒక్కసారిగా రెక్కలు
- పూలు, పండ్లు కొనాలంటే జనం హడల్
- శ్రావణ మాసం కావడంతో అడ్డగోలుగా పెంపు
- మార్కెట్‌లో ధరలు చూసి నగరవాసులు బెంబేలు



మార్కెట్‌లో పూల విక్రయాలు



పట్నంబజారు: శ్రావణమాసంలో మహిళలు పలు పూజలు, వ్రతాలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. వాటికి పూలు, పండ్లు, ఇతరత్రా పూజా సామాగ్రి అవసరం. శ్రావణ మాసం నేపథ్యంలో వ్యాపారులు అడ్డగోలుగా ధరలు పెంచి విక్రయిస్తున్నారు. దీంతో నగరవాసులు బెంబేలెత్తుతున్నారు. మామూలు రోజుల్లో చామంతులు కేజీ రూ.400 వరకు ఉంటాయి. ఈ ఆదివారం కూడా అదే ధరతో విక్రయించారు. సోమవారం ఏకంగా రూ.700 నుంచి రూ.800 వరకు పెంచేశారు. బంతిపూలు సైతం సాధారణ రోజుల్లో కేజీ రూ.200 - రూ. 300 ఉండేది. ఇప్పుడు ఏకంగా రూ.700 చేశారు. బంతిపూల మాలలు రూ.100 పెడితే గతంలో 10 నుంచి 12 మూరలు ఇస్తుండే వారు. ఇప్పుడు నాలుగే ఇస్తున్నారు. కొత్తగా కేవలం గుమ్మానికి సరిపోయేలా దండలు తయారు చేసి రూ.100కు విక్రయిస్తున్నారు. కలువ, తామర పువ్వు లైతే రూ. 100కు మూడు ఇస్తున్నారు. మూర తులసీ మాల రూ.70 నుంచి రూ.100 వరకు అమ్ము తున్నారు. ఆఖరుకు మామిడి, అరటి ఆకులు, గరిక ధర కూడా రూ.50 నుంచే మొదలవుతోంది. వ్యాపారుల దోపిడీకి ఈ ధరలు అద్దం పడుతున్నాయి. మల్లె పూలు మూర రూ.40 - రూ. 50 వరకు విక్రయిస్తున్నారు. గుప్పెడు గులాబీలు, మల్లెలు, చామంతులు, బంతిపూలు, కదంబం పూల ధర కూడా రూ. 50 నుంచి మొదలవుతోంది.

పండ్ల వ్యాపారులదీ అదే దారి...

పూజలకు ముఖ్యమైన పండ్ల విషయంలోనూ వ్యాపారులు అమాంతం ధరలు పెంచేశారు. యాపిల్ మంచి రకం డజను రూ.500పైనే విక్రయిస్తున్నారు. దానిమ్మ సైతం దాదాపుగా అదే రేటు ఫిక్స్ చేసి విక్రయాలు జరుపుతున్నారు. డజను అరటి పండ్లు రూ.100కుపైగా అమ్ముతున్నారు. కిరాణా షాపుల్లో సైతం చిన్న సైజు కొబ్బరికాయ రూ 40, కొంచెం పెద్దగా ఉంటే రూ. 60 వరకు తీసుకుంటున్నారు.

25 టన్నులకుపైగా అమ్మకాలు

గుంటూరు జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల్లో పూల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గుంటూరులోని కొల్లి శారదా మార్కెట్, పట్నంబజారులోని పూల మార్కెట్‌లలో అధికంగా హోల్‌సేల్ వ్యాపారం జరుగుతోంది. సుమారుగా 80కిపైగా దుకాణాలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 10 నుంచి 12 టన్నుల వరకు వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. శ్రావణం, కార్తిక వంటి నెలల్లో 25 నుంచి 30 టన్నుల పూలు విక్రయిస్తారని తెలిపారు. ముఖ్యంగా బెంగళూరు, కర్ణాటకలోని చిక్‌మంగులూరు, రాష్ట్రంలోని కుప్పం, వి.కోట, మదనపల్లి, అనంతపురం, తూర్పు గోదావరి జిల్లా కడియం నుంచి చామంతి, గులాబీలు, బంతిపూలు దిగుమతి అవుతున్నాయి. చీరాల నుంచి జాజి పూలు, డెల్టా ప్రాంతం నుంచి మల్లెపూలు, అనంతపురం నుంచి కనకాంబరం, చెన్నై నుంచి వరువం అధికంగా మార్కెట్‌కు వస్తాయి. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చే పూలను పలు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ముఖ్యంగా గుజరాత్ వ్యాపారులు కొనుగోలు చేయటంతో ధరలు పెరిగాయని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు.

చిన్నారులపై ఔదార్యం చూపండి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: సమాజంలో ఏ పాపం చేయకపోయినా అనాధలుగా జీవించే వారిపట్ల ఔదార్యం ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారితో కలిసి కలిసొచ్చే కాలానికి - నడిచొచ్చే పిల్లలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. సమాజంలో ఎవరైనా చిన్నారులను పెంచుకోవాలి అనుకున్న వారికి హోమ్స్‌లో ఉన్న 6-18 సంవత్సరాల వయస్సున్న వారిని తాత్కాలికంగా తొలి 6 నెలలు తమ ఇంటికి తీసుకెళ్లి పెంచుకోవచ్చన్నారు. ఇద్దరికీ నచ్చితే మరో ఆరు నెలలు ఇలా 2 సంవత్సరాల వరకు పెంచుకుని ఆ తర్వాత పూర్తి స్థాయిలో దత్తత తీసుకునే వీలుంటుందని వెల్లడించారు. దీనికి గాను బిడ్డ ఖర్చులకు కేంద్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.4000 అందజేస్తుందన్నారు. దీనివలన అనాధలకు తల్లిదండ్రులు, గార్డియన్స్ లభిస్తారని, పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఔత్సాహికులు ముందుకు వచ్చి సంప్రదించాలని కోరారు. ఐసీడీఎస్ పీడీ ప్రసూన మాట్లాడుతూ కలెక్టర్ అధ్యక్షతన ఏడుగురు కమిటీ సభ్యులు దత్తత కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, హౌసింగ్ పీడీ ప్రసాద్, సీపీఓ శేషశ్రీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్రీడలు, కళలతో ఒత్తిడి దూరం



బహుమతులు అందజేస్తున్న కిషోర్ కుమార్, ఆనంద్ కిషోర్, రంగసాయి

కొరిటెపాడు(గుంటూరు): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుంటూరు జోనల్ క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు ఉద్యోగులు కుటుంబ సభ్యుల సమక్షంలో ఆదివారం సాయంత్రం రెవెన్యూ కల్యాణ మండపంలో ఆహ్లాదకరంగా జరిగాయి. అందులో భాగంగా, ఆడంబరాల వల్ల వచ్చే తంటాలను తెలియపరుస్తూ కోటి రెడ్డి దర్శకత్వంలో గరికపాటి శ్రీనివాసరావు రచించిన కలహాల కాపురం నాటకం, పిల్లల నృత్య ప్రదర్శన, ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పెండ్యాల రమేష్, విజయ సంపత్, చెరుకూరి వీరాంజనేయులు తదితరులకు గుంటూరు పట్టణ రీజనల్ మేనేజర్ కిషోర్‌కుమార్, చీఫ్ మేనేజర్ ఆనంద్ కిషోర్, పావులూరి రంగసాయి బహుమతులను అందజేశారు. స్టేట్ బ్యాంకు ఉద్యోగులను నాటక రంగ ప్రముఖులు జంపని కిషోర్ బాబు, వరికూటి శివప్రసాద్‌లు అభినందించారు.

దళిత, గిరిజనులకు నేటికీ స్వాతంత్ర్యం రాలేదు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

మంగళగిరి టౌన్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అయినా నేటికీ దళిత, గిరిజనులను స్వాతంత్ర్యం రాలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, దళిత్ సోషల్ ముక్తిమంచ్ జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధి టిప్పర్ల బజారులోని కేవీపీఎస్ (కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం) గుంటూరు జిల్లా 6వ మహాసభ ఆదివారం రాత్రి నిర్వహించారు. సామాజిక న్యాయం అంశంపై జరిగిన సెమినార్‌లో శ్రీనివాసరావు మాట్లాడుతూ దళితులు ఎదుర్కొంటున్న ఆర్థిక రాజకీయ సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా దళిత ఉద్యమానికి కంచుకోట అని అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే గుంటూరు జిల్లాలో అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయని గుర్తుచేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అసమానతలు, దళితులపై దాడులు నిత్యకృత్యమయ్యాయన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ఉన్నప్పటికీ దళిత, గిరిజనులకు న్యాయం జరగడం లేదన్నారు. డాక్టర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేసే పరిస్థితుల్లో పాలకులు లేరన్నారు. గిరిజన ప్రాంతాల్లో అదానీకి భూములు అప్పగించడానికి కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. పీ-4 పథకం ఓ చెత్త పథకమన్నారు. అనంతరం 15 మందితో కూడిన కేవీపీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా వై.కమలాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నవీన్ ప్రకాష్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, లూదర్ పాల్, సహాయ కార్యదర్శులుగా దుర్గారావు, రమేష్‌లను ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నేతాజీ, కేవీపీఎస్ రాష్ట్ర కార్యాదర్శి ఆంద్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో 27.2 మి.మీ వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 27.2 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 1.2 మి.మీ వర్షం పడింది. సగటున 6.7 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు పశ్చిమలో 20.6 మి.మీ, గుంటూరు తూర్పు 16.8, పెదకాకాని 15.4, తుళ్లూరు 12.6, ఫిరంగిపురం 6.8, కాకుమాను 3.8, ప్రత్తిపాడు 3.2, చేబ్రోలు 2.8, మంగళగిరి 2.4, తాడికొండ 2.2, పొన్నూరు 2, తెనాలి 1.8, మేడికొండూరు మండలంలో 1.6 మి.మీ చొప్పున వర్షం పడింది.

నిర్ణీత గడువులోగా ఫిర్యాదులకు పరిష్కారం

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



వృద్ధుడి సమస్య తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: కన్న కొడుకే ఇబ్బందులకు గురిచేస్తున్నాడంటూ ఓ మాతృమూర్తి వాపోయింది. ఈ మేరకు నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ)లో ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసింది. కార్యక్రమంలో బాధితుల నుంచి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఆలకించారు. ఆయా సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. నిర్ణీత గడువు లోగా చట్టపరిధిలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. బాధితుల పట్ల నిర్లక్ష్యం చూపవద్దని స్పష్టం చేశారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి (మహిళా డీఎస్పీ), శివాజీరాజు (సీసీఎస్) అర్జీలు స్వీకరించారు.

అద్దె చెల్లించడు.. ఖాళీ చేయడు..

భారత్‌పేట వద్ద ఓ అపార్ట్‌మెంట్‌లో రెండు ఫ్లాట్లు వేర్వేరుగా కొనుగోలు చేశాం. ఓ వ్యక్తి ఇనిస్టిట్యూట్ కంటూ రెండు ఫ్లాట్‌లు అద్దెకు తీసుకున్నాడు. మొదట్లో నెల నెలా అద్దె చెల్లించేవాడు. అయితే ఇనిస్టిట్యూట్‌కు విద్యార్థులు రావడంలేదనే సాకుతో అద్దె చెల్లించడం మానేశాడు. అయితే ఆ రెండు ఫ్లాట్లను వేరే వారికి అతను అద్దెకు ఇచ్చినట్లు తెలిసింది. అదేమని అడిగితే పొంతన లేని సమాధానం చెబుతున్నాడు. ఖాళీ చేయడం లేదు.. న్యాయం చేయగలరు.

– కాలేషావలి, కుమారి, ఫ్లాట్ల యజమానులు గుంటూరు

కొడుకు ఇంట్లో నుంచి తరిమేశాడు



సుమారు ఎనిమిదేళ్ల క్రితం భర్త సాంబశివరావు రోడ్డు ప్రమాదంలో మరణించారు. భర్త మరణాంతరం చంద్రన్న బీమా, ఎల్ఐసీ, బ్యాంక్ బీమా ఇతరత్రా వాటి కింద రూ.12.50 లక్షలు వచ్చాయి. నా కుమారుడు 2018లో నాకు తెలియకుండా డబ్బులన్నీ స్వాహా చేశాడు. దీనిపై పలుమార్లు కుమారుడిని అడిగినా ప్రయోజనం లేదు. స్థానిక పోలీసులు, జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలుమార్లు ఫిర్యాదు చేసిన ఆలకించేవారు కరువయ్యారు. ప్రస్తుతం విజయవాడలో ఉంటున్న కుమార్తె కుమారి వద్ద ఉంటున్నాను. అయితే నా కుమార్తె, అల్లుడిని కూడా కొడుకు బెదిరిస్తున్నాడు. మేడికొండూరు మండలంలోని పాలడుగులోని నా ఇంట్లో ఉంటూ నన్ను తరిమేశాడు. దయచేసి నా ఇల్లు ఇప్పించగలరు.

– పి.లక్ష్మీరాజ్యం, పాలడుగు, మేడికొండూరు

ఉద్యోగాల పేరుతో మోసం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని తెలిసిన ఓ వ్యక్తి నమ్మబలికాడు. దీంతో అతనితోపాటు అతని స్నేహితులకు సుమారు రూ.13 లక్షలు చెల్లించాను. దీంతో ఓ కంపెనీలో చేర్పించాడు. అయితే మూడు నెలలు ఉద్యోగం చేసినా వారు జీతం చెల్లించలేదు. దీనిపై అడిగితే వారి నుంచి సరైన సమాధానం లేదు. ఉద్యోగం వస్తుందని అప్పులు చేసి, వడ్డీకి తీసుకువచ్చి వారికి చెల్లించాను. సదరు వ్యక్తిని పిలిచి విచారించి, న్యాయం చేయాలని కోరుతున్నా.

– ఎస్.చైతన్య, గుంటూరు

నాలుగు కిలోల గంజాయి పట్టివేత



రైల్వే పోలీసుల అదుపులో నిందితులు, చిత్రంలో స్వాధీనం చేసుకున్న గంజాయి

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని గుంటూరు రైల్వే స్టేషన్‌లో సోమవారం నాలుగు కిలోల గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు రైల్వేస్టేషన్‌లో మత్తు పదార్థాల రవాణా నివారణ చర్యలలో భాగంగా గుంటూరు ఆర్పీఎఫ్, జీఆర్పీ, కొత్తపేట పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో రైల్వే స్టేషన్ తూర్పు వైపు ఒకటో నంబర్ ప్లాట్ ఫామ్‌పై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనించారు. వారి వద్ద ఉన్న బ్యాగ్‌లను తనిఖీ చేయగా నాలుగు కిలోల గంజాయి బయటపడింది. ఇద్దరు నిందితులను అదుపులో తీసుకున్న పోలీసులు జీఆర్పీ స్టేషన్‌కు తరలించి విచారించగా కర్ణాటకు రాష్ట్రంలో మల్లన్న కుప్పె, మద్దూర్ తాలుకాకు చెందిన మహేష్, కర్ణాటక రాష్ట్రం దుందనహళ్లి, మల్లూర్ ప్రాంతానికి చెందిన అశ్వత్‌గా తేలింది. వీరిద్దరు చెడు వ్యసనాలకు అలవాటు పడి, సులువైన మార్గాల్లో డబ్బు సంపాదనకు గంజాయి తరలింపును ఎంచుకున్నారు. విశాఖపట్నం నుంచి బెంగళూరుకు గంజాయితో వెళుతున్నట్లు తెలిపారు. నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీలలో జీఆర్పీ సీఐ అంజిబాబు, కొత్తపేట సీఐ వీరయ్య, ఆర్పీఎఫ్ ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

రెగ్యులరైజేషన్ ప్రక్రియ పునఃప్రారంభించాలి

- పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి



ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

తాడేపల్లి రూరల్: ఎన్నికల కోడ్ కారణంగా చివరి దశలో నిలిచిపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్స్ సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియ వెంటనే పునఃప్రారంభించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో వున్న ఇంటర్మీడియట్ కమిషనరేట్ కార్యాలయం వద్ద సోమవారం కాంట్రాక్ట్ లెక్చరర్స్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచార సభలో నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ జీఓ 114 ప్రకారం కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను తక్షణమే రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. పనిచేయించుకున్న కాలానికి వేతనం విడుదల చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని పేర్కొన్నారు. మే నెలకు సంబంధించిన 2024, 2025 సంవత్సరాల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. డిమాండ్లు పరిష్కరించకపోతే త్వరలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. అనంతరం ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ డైరెక్టర్ తాతారావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మాణిక్యం, గాంధీ, రత్నకుమారి, ఉమ, లత, దయాకర్, రేవతి పాల్గొన్నారు.

రైలు దిగే క్రమంలో మహిళకు తీవ్ర గాయాలు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న రైలు ఎక్కి, దిగే క్రమంలో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొన్నూరు మండలం బోడిపాలెం గ్రామానికి చెందిన నూతి కమల, ఆమె మేనల్లుడు సికింద్రాబాద్ వెళ్లేందుకు సోమవారం గుంటూరు రైల్వే స్టేషన్‌కు వచ్చారు. ఈ నేపథ్యంలో ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై శబరి ఎక్స్‌ప్రెస్ రావడంతో మూత్ర విసర్జన నిమిత్తం కమల రైలు ఎక్కింది. ఎక్కిన వెంటనే రైలు కదలడంతో రైలు దిగే క్రమంలో కిందపడి ప్లాట్‌ఫారంకు రైలుకు మధ్యలో పడిపోయింది. ఘటనలో కమల చెయ్యి నుజ్జునుజ్జయింది. దీన్ని గమనించిన ప్రయాణికులు తక్షణమే చైన్ లాగి రైలును నిలిపి వేశారు. ప్రయాణికులు రైల్వే పోలీసులు హుటాహుటిన ఆమెను అంబులెన్స్ ద్వారా గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు.

ముగ్గురు పిల్లల సహా తల్లి అదృశ్యం

తాడికొండ: మండల పరిధిలోని బండారుపల్లి గ్రామానికి చెందిన వివాహిత గండాల వరలక్ష్మి తన ముగ్గురు పిల్లలతో సహా కనిపించడం లేదని ఆమె తండ్రి పువ్వాడ అంత్యాక్షరి తాడికొండ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. వరలక్ష్మితోపాటు కుమారులు 12 ఏళ్ల మల్లికార్జునరావు, తొమ్మిదేళ్ల లీలామనోహర్, ఏడేళ్ల కుమార్తె మహాలక్ష్మి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14న అండర్-15 వాలీబాల్ జట్ల ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 14న ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-15 బాల, బాలికల వాలీబాల్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి మెల్లంపూడి రవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు. 2010 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించిన విద్యార్థులే అర్హులని, ఎంపికైన ఎనిమిది మంది బాల, బాలికలు ఈనెల 18న విజయవాడ పటమటలోని కేబీసీ జెడ్పీ హైస్కూల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి ఎంపికలో పాల్గొంటారని వివరించారు.

ఓబీసీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి



జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారామ్ అహీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఓబీసీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలోని జాతీయ బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ హన్స్‌రాజ్ గంగరామ్ అహీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 63 కేంద్ర ప్రభుత్వ శాఖల్లో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యా, ఉపాధి రంగాల్లో ఓబీసీలకు రిజర్వేషన్ల పరిరక్షణకు తగిన చొరవ చూపాలన్నారు. గత 3, 4 సంవత్సరాలుగా వివిధ రాష్ట్రాలలో నీట్ సీట్ల భర్తీ విషయంతో తీవ్ర అన్యాయం జరుగుతుందని దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. దేశంలో 52శాతానికి పైగా జనాభా కలిగిన ఓబీసీల సాధికారిత కోసం ఓబీసీ సబ్ ప్లాన్ చట్టాన్ని రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని సూచించారు. కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడంతో పాటు ఓబీసీల్లోని అన్ని కులాల విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం అమలు చేసేలా చూడాలని కోరారు. ఆయనవెంట ఏపీ బొందిలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుజాన్ సింగ్, ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణంరాజు, సంఘ నాయకులు ఉరిటి అశోక్‌కుమార్, ముంగమూరి హైమారావు, ఖాసీం పాల్గొన్నారు.

ఐడీబీఐ బ్యాంక్ వద్ద నిరసన



నిరసనలో పాల్గొన్న కిషోర్ కుమార్, బాషా, సోమసుందరం తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐబీఈఏ) దేశంలోని అన్ని ఐడీబీఐ బ్యాంకుల్లో ఒకరోజు సమ్మె ప్రకటించారు. ఈ పిలుపులో భాగంగా గుంటూరు లక్ష్మీపురంలోని ఐడీబీఐ బ్యాంకు బ్రాంచ్ వద్ద గుంటూరు జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. బ్యాంక్ ఉద్యోగుల సంఘం సలహాదారుడు పి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ లాభాల బాటలో నడుస్తున్న ఐడీబీఐ బ్యాంకును కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ చేస్తున్న సమ్మెకు జిల్లాలోని అన్ని బ్యాంకుల ఉద్యోగుల పూర్తి మద్దతు ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రభుత్వ రంగ గ్రామీణ బ్యాంకుల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను తీవ్రస్థాయిలో ఎదుర్కొనేందుకు కలసికట్టుగా పోరాడతామని హెచ్చరించారు. ఐడీబీఐ ఉద్యోగుల నాయకుడు సోమసుందరం మాట్లాడుతూ ఐడీబీఐ బ్యాంకును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం జిల్లా కార్యదర్శి బాషా మాట్లాడుతూ ఈ సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, ఐడీబీఐ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు నివాసాల్లో భారీ చోరీ

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్) : తలుపులు పగులకొట్టి రెండు నివాసాల్లో భారీ చోరీలకు పాల్పడిన ఘటనపై సోమవారం కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతగుంటూరులోని సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద నివాసం ఉండే పర్వతం దివ్య, శ్రీరామచంద్రం ఈ నెల 7వ తేదీన వారి వారి కుటుంబాలతో తిరుపతి వెళ్ళారు. తిరిగి సోమవారం ఇంటికి వచ్చారు. దివ్య నివాసంలో 82 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి, శ్రీరామచంద్రం నివాసంలో 42 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ గుంటూరు జీరో లైన్, నల్లచెరువు, సంపత్‌నగర్ వెళ్లే రోడ్డుకు దగ్గరలో బీ.ఫామ్ 78గజాలు కింద డబుల్ బెడ్ రూమ్, పైన రేకులతో రెండు పోర్షన్ ఇల్లు 45లక్షలకు అమ్మబడును. 9959920729

LAND FOR SALE

■ 'మెగా అవకాడో ఫామ్‌ల్యాండ్ '11సెంట్లు 5 లక్షలు మాత్రమే. 5 నుండి 60 సంవత్సరముల వరకు ఏటా 2 నుండి 5 లక్షల ఆదాయం పొందవచ్చు. ఫోన్: 9133574455

PLOT FOR SALE

■ గుంటూరు సిటీ కార్పొరేషన్ పరిధిలో 500 గజాల స్థలం అమ్మబడును. సంప్రదించండి. 89783 89518, 63037 24464.

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ 8790741166

WANTED

■ శ్రీ కంప్యూటర్ M.S Office, Spoken English కోర్సు 3 నెలల శిక్షణ ఇచ్చి ఉపాధి చూపబడును. శ్రీ భోజనం హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ, 18-28సం॥లోపు. 9133444989/ 88

■ స్వామి వివేకానంద గ్రూపు (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th చదివిన వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 9502501122, 9573691122

■ మంగళగిరి తెనాలి ఏరియాలో పురుగు మందు కంపెనీలో పనిచేయుటకు యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15,000+3000. సంప్ర॥ 9121469383

■ గుంటూరు లక్ష్మీపురంలోని ప్రముఖ డెంటల్ హాస్పిటల్ నందు P/F టైమ్ పనిచేయుటకు M/F రిసెప్షనిస్ట్ & క్లీనింగ్ స్టాఫ్ కావలెను. వ: 25సం॥ లోపు లోకల్ వారు మాత్రమే. 8500808778

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ 20K. ఫోన్: 8977639662, 8977639663

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ. 100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశేషంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.